ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024



సీఎంను కలిసిన ప్రభుత్వ విప్
- ఆలయ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని సూచన - 7లో..

చాకలి ఐలమ్మకు ఘన నివాళి - 8లో..



మల్కపేట రిజర్వాయర్

మల్కపేట రిజర్వాయర్‌లో పంప్‌ల ద్వారా ట్రయల్‌రన్ (ఫైల్)

ఎత్తిపోతలకు ఎదురుచూపులు

- మల్కపేట రిజర్వాయర్ ట్రయల్‌రన్‌కు ఏడాది
- కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలతో జాప్యం
- మిడ్‌మానేరు నుంచి ఇతర ప్రాజెక్ట్‌లకు నీళ్లు
- మల్కపేట ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోతలు దూరం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాళేశ్వరం ఎత్తిపోతలతో మెట్ట ప్రాంతంలో పంటలకు నీళ్లు ఎప్పుడు చేరుతాయోనని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. పథకంలో భాగంగా 9వ ప్యాకేజీలో మల్క పేట రిజర్వాయర్ నిర్మించారు. మిడ్ మానేరు నుంచి ట్రయల్‌రన్ కూడా నిర్వహించారు. ఏడాది దాటినా ప్రారంభో త్సవానికి మోక్షం లభించడం లేదు. ప్రాజెక్టుకు తెలంగాణ రైతాంగ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే దివంగత సీహెచ్ రాజేశ్వర్‌రావు పేరును నామకరణం చేశారు. ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైన వాయిదాలతో నిలిచిపోయింది. ట్రయల్ రన్‌తో గత ప్రభుత్వ హయాం లోనే అన్నదాతలకు రిజర్వాయర్ చేరువవుతుందని భావించారు. సిరిసిల్ల మానేరు వాగుపై 27 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టుకు అనుసంధానంగా జిల్లాలోని అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్ట్ నిర్మించారు. మరోవైపు కోనరావుపేట మండలం మల్కపేట వద్ద రిజర్వాయర్ పూర్తి చేశారు. గతేడాది మే, జూన్‌లో మిడ్ మానేరు నుంచి ఒక టీఎంసీ నీటిని ప్రాజెక్ట్‌లోకి నింపి ట్రయల్‌రన్ నిర్వహించారు. అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో ప్రారం భోత్సం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రెండు సార్లు వాయిదా పడింది. చివరకు ప్రభుత్వం మారడం, కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు తలెత్తడం, మిడ్‌మానేరులోకి ఎత్తిపోతలు నిలిచిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌తో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మిడ్ మానేరులోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. 27 టీఎంసీల సామర్థ్యం ఉన్న మిడ్ మానేరులో ప్రస్తుతం 17 టీఎంసీల నీరు చేరడంతోనే మిడ్ మానేరు నుంచి అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్టులోకి అక్కడి నుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వరకు నీటిని విడుదల చేశారు. దిగువన ఉన్న ఎల్‌ఎండీ ప్రాజెక్ట్‌తోపాటు కాలువల ద్వారా కూడా నీటిని విడుదల చేస్తున్నారు. తోటపల్లి, గౌరవెల్లి ప్రాజెక్ట్‌ల వరకు ఉన్న ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అంతా సిద్ధం చేసినా మల్కపేట ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయక పోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

• తాగు, సాగునీరు గోస తీరేనా?

గోదావరి జలాల పరవళ్లతో జిల్లా కళకళలాడింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఏర్పడిన అవాంతరంతో ఆందోళనలు నెలకొన్నాయి. అనంతరం ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు మొదలవడంతో ఇబ్బందులు ఉండవని, తాగు, సాగు నీరు గోస తీరుతుందని రైతులు, ప్రజలు భావిస్తున్నారు. గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని ప్రాజెక్ట్‌లకు సిరిసిల్ల మానేరు తీరం వారధిగా మారింది. సిరిసిల్ల మానేరు వాగుపై 27 టీఎంసీల సామ ర్థ్యంతో నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరుప్రాజెక్ట్ నీటి నిల్వతో 18 కిలోమీటర్ల మేరకు బ్యాక్ వాటర్‌తో జలకళ సంతరించుకుంది. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు అనుసంధానం గానే జిల్లాలో అనంతారం అన్నపూర్ణ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఆసియా లోనే అతిపెద్దదైన సర్జిపూల్ నిర్మించి అనంతగిరి ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపో యడం ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ వరకు కాళేశ్వరం జలాలను పరుగులెత్తించారు. జిల్లా నుంచి గోదావరి జలాలు ఎత్తిపోతలతో ఇతర జిల్లాలకు తరలివెళ్తుంటే సిరిసిల్ల వేములవాడ నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల రైతులు కాళేశ్వరం 9వ ప్యాకేజీ ద్వారా కాలువల నిర్మాణం, నిజాం కాలంలో నిర్మించిన ఎగువ మానేరు ప్రాజెక్ట్‌కు నీటి మళ్లింపుతో పాటు తొమ్మి దేళ్లుగా మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే మల్కపేట రిజర్వా యర్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

• రూ.996 కోట్లతో 9వ ప్యాకేజీ పనులు

జిల్లాలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల ద్వారా సిరిసిల్ల, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, మండలాల్లో భూగర్భ జలాలు పెరగడంతో ఆయకట్టు పెరుగుతుందని అంచనాలు వేశారు. సిరిసిల్ల మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి ఎగువ మానేరు ప్రాజెక్ట్ వరకు రూ.996 కోట్లతో 9వ ప్యాకేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు గుట్టలను అనుసంధానం చేశారు. ఆరు కట్టలతో మూడు టీఎంసీల సామర్థ్యంతో రూ.504 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. త్వరలోనే అందుబాటులోకి వస్తుందని భావించినా రైతులకు నిరాశే మిగిలింది. ట్రయల్‌రన్ పూర్తి చేసుకొని ఏడాది గడిచినా కొత్త ప్రభుత్వం దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నుంచి మల్కపేట ప్రాజెక్ట్ వరకు నీటిని మళ్లించడానికి 12 కిలోమీటర్ల టన్నెల్, అక్కడ సర్జిపూల్ నిర్మించారు. 30 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు పంపుల ద్వారా 560 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్‌లోకి ఎత్తిపోస్తారు. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభమైతే దాని ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లోకి 2 టీఎంసీలు, బత్తుల చెరువు 2 టీఎంసీలు నింపడంతోపాటు వాటి పరిధిలో ఉన్న చెరువులు నిండడం ద్వారా 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టు పెరగనుంది. ఇప్పటికే సింగసముద్రం, వరకు కాలువల నిర్మాణాలు చేపట్టారు. మల్కపేట రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే జిల్లాలో సమృద్ధిగా సాగునీటి వనరులు అందుబాటులోకి వస్తాయని ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరా మహిళాశక్తితో ఆర్థిక ప్రగతి సాధించాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 : ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో ఉన్న మెడికల్ కళాశాలలో తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మార్కండయ మహిళ సమాఖ్య రూ.5లక్షల రుణంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేయగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కలిసికట్టుగా స్థానిక ఆహార పదార్థాలు నాణ్యతతో అందజేయాలని సూచించారు. డీఆర్‌డీవో శేషాద్రి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీఎంలు సంధ్యారాణి, పద్మయ్య పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకెళ్లాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 : మానసిక సమస్యలు, ఒత్తిడితో బాధపడే ప్రజలందరు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా టోల్ ఫ్రీ నంబరు 14416, పోస్టర్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా వైద్యాధికారి వసంత్‌రావుతోకలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో ర్యాలీలు నిర్వహించి ఆత్మహత్యల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆత్మహత్యలను అడ్డుకోవడంలో టెలీమానాస్(టోల్‌ఫ్రీ నంబర్ 14416) 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నయిమాజహా తదితరులుపాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన డీఈవో



విద్యార్థుల స్థాయిని పరిక్షిస్తున్న డీఈవో

గంభీరావుపేట సెప్టెంబరు 10:గంభీరావుపేట కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలో ఉన్న ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మంగళవారం పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. వంద శాతం ఫలితాలను రాబట్టాలన్నారు. జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వీర్నపల్లి, సెప్టెంబరు 10:సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో డ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసర ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిని సిబ్బంది తొలగించారు. ఎంఎల్‌హెచ్‌పీ చైతన్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 10: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 11600, ములవాగు, మానేరు వాగు ద్వారా 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను నిలిపి వేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 316.14 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 22.97 టీఎంసీలకు చేరుకుంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపం లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.76 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రాజన్నను దర్శించుకున్న యాదగిరిగుట్ట ఈవో

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 10 : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని యాదగిరిగుట్ట ఈవో, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రావు కుటుంబ సభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ నర్సయ్య స్వాగతం పలికారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

చందుర్తి, సెప్టెంబరు 10 : నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వీటితో నేరాలను కట్టడి చేయవచ్చని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని, నేరస్థులు సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరం చేసేందుకు వెనుకడుగు వేస్తారని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కాలనీలో జరిగే అసాంఘీక కార్యకలాపాల గురించి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



భోజన వసతిని పరిశీలిస్తున్న కలెక్టర్

కోనరావుపేట, సెప్టెంబరు 10: విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. బాలబాలికల డార్మిటరీ తరగతి గదుల్లో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, పాఠ శాలకు రోడ్డు లేదని తెలపడంతో ఎంపీడీవో శ్రీనివాస్‌ను వసతులు కల్పిం చాలని ఆదేశించారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించేలా చూడా లన్నారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఉన్నారు. అనంతరం నిమ్మపల్లిని పరిశీలించారు.

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 10: ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వహించ వద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించి 5 ఎస్ అమలు తీరు, బ్లూ కోల్ట్స్, పెట్రోకార్స్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల పట్టణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చూడాలన్నారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ పాల్గొన్నారు.

బహుజన చైతన్యానికి ప్రతీక



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 : తెలంగాణ బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచిందని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్య సాహసాలు ఎనలేనివన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, వేముల వాడ ఆర్డీవో రాజేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి రాజు, మనోహర్, జిల్లా అధికారులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



సంపత్‌కుమార్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గంభీరావుపేట, సెప్టెంబరు 10:జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాడూరి సంపత్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంపత్ కుమార్‌ను సీఎం అభినందించారు. పాఠశాల విద్యాశాఖ సెక్రెటరీ బుర్ర వెంకటేశం పాల్గొన్నారు.

12న ఎస్‌జీఎఫ్ క్రీడలు

వేములవాడ, సెప్టెంబరు 10: వేములవాడ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఈనెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు హమీద్, రవీందర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో బైపాస్ రోడ్డులోని గురుకుల పాఠశాల సమీపంలో నిర్వహించనున్న ఈ పోటీలలో భాగంగా 12న బాలికలకు, 13న బాలురులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 913394724, 9440093987 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువత గంజాయికి దూరంగా ఉండాలి



స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి, సెప్టెంబరు 10 : గ్రామీణ ప్రాంతంలోని యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. చందుర్తి మండలం కొత్తపేట, సనుగుల గ్రామాల్లోని యువతకు కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా క్రీడా సామగ్రిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో చదువు, ఉద్యోగంతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని అన్నారు. ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లవద్దని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఉద్యోగాలు సాధించి, తమ తల్లిదండ్రుల పేరు ప్రతిష్టలను నిలబెట్టాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంటుందన్నారు. యువత చదువుతో పాటుగా క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గ్రామంలో అసాంఘిక శక్తులకు సంబంధించిన సమాచారమైనా పోలీసులకు అందించాలని కోరారు. గ్రామాల నుంచి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకునేందుకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ను 8712656411 నంబరులో లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించవచ్చని సూచించారు. కొత్తపేట గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఉన్న వివిధ సమస్యలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా తమ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్, చందుర్తి ఏఎస్సై బాపు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గడువులోగా సాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం హిట్ అండ్ రన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద బాదితులు, వారి కుటుంబ సభ్యులకు నిర్ణయించిన గడువులోగా రెవెన్యూ, పోలీస్ అధికారులు నివేదిక ప్రకారం పరిహారం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుం బానికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవోలు రమేష్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ప్రభుత్వ విప్



మహేష్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబరు 10: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాదులో పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆది శ్రీనివాస్ ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చందుర్తి, సెప్టెంబరు 10 : ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొజ్జ మల్లేశం అన్నారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలో ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి వైద్య ఖర్చులకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నట్లు చెప్పారు. నాయకులు అంచ శ్రీహరి రెడ్డి, ,బొజ్జ రాజయ్య, జంగ సాగర్ రెడ్డి, బొజ్జ దేవయ్య, కట్కూరి దేవయ్య, గుంటుక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం నుంచి 1.30 కోట్ల చీరల ఆర్డర్లను ప్రకటించడంతో నేతన్నలు సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు, పవర్‌లూం ఆసాములు, నేత కార్మికులు క్షీరాభిషేకాలు చేస్తున్నారు. మంగళవారం సిరిసిల్ల చేనేత చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ చేనేత విభాగం, సిరిసిల్ల వార్పిన్, పాలిస్టర్ వస్త్రోత్పత్తి సంఘం, చేనేత వస్త్ర వ్యాపార సంఘం ఆధ్వర్యంలో విడివిడిగా సంబరాలు నిర్వహించారు. సిరిసిల్ల కొండ లక్ష్మణ్‌బాపూజీ చౌరస్తాలో ఆసాముల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, పార్లమెంట్ కన్వీనర్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అడెపు భాస్కర్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, లక్ష్మీనారాయణ, వనిత, స్వరూప, వస్త్రోత్పత్తి దారుల సంఘం ప్రతినిధులు అంకారపు రవి, గోవిందు రవి, గౌడ రాజు, దామోదర్, శ్రీనివాస్, దేవదాస్, సత్యం, అశోక్, ఆసాముల సంఘం అధ్యక్షుడు రవీందర్, కార్యదర్శి అశోక్, మండల రాజు పాల్గొన్నారు.



చేనేత విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్‌యూ డిగ్రీ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 10: శాతవాహన విశ్వ విద్యాలయం (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్) డిగ్రీ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్ వైస్ ఎగ్జామ్ ఫీజు నోటిఫికేషన్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. విశ్వ విద్యాలయ పరిధిలోని విద్యార్థులు చదువుకునే కళాశాలకు వెళ్లి ఫీజు చెల్లించాలన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు ఫస్ట్, సెకండ్ అండ్ థర్డ్ ఇయర్ ఫీజు నోటిఫికేషన్ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 10: దొంగతనం జరిగిన 24 గంటల్లోగా నిందితులను పట్టుకున్నారు రూరల్ పోలీసులు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏఎస్పీ శేశాద్రినీరెడ్డి మంగళవారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. మల్లారం గ్రామం రాజానగర్‌కు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన సందెల్లి అనీల్, సయ్యద్ అఫ్రోజ్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కొన్నిరోజులుగా ఇంటికి కలర్ వేసే పని జరుగుతున్న క్రమంలో ఆదివారం శ్రీనివాస్ భార్యతో కలిసి బెజ్జంకికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని హ్యాండ్ బ్యాగ్ కనబడలేదు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారం ఉన్నట్లు ఫిర్యాదులో తెలిపాడు. విచారణ చేపట్టిన రూరల్ ఎస్సై మారుతీ ఇంటికి కొద్ది దూరంలో బ్యాగును కనిపెట్టారు. బ్యాగుకు కలర్ మరకలు ఉండడంతో ఆ కోణంలో దర్యాప్తు చేశారు. కలర్ వేసిన అనీల్, అఫ్రోజ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం రికవరీ చేసి నిందితులను రిమాండుకు తరలించినట్లు ఏఎస్పీ శేశాద్రినీరెడ్డి తెలిపారు. సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందరూ.. అంత్యక్రియలకు..

మృతుడి ఇంట్లో దొంగతనం

మల్యాల, సెప్టెంబరు 10: మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబ సభ్యులు వెళ్లగా కాసేపటికే బంధువుగా చెప్పుకున్న వ్యక్తి ఒకరు మృతుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. కొండగట్టుకు చెందిన గౌరపల్లి లక్ష్మన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు మధ్యాహ్నం వైకుంఠధామానికి వెళ్లారు. అయితే ఇంటి వద్ద పనులు చేయడానికి కొందరు బంధువులు ఉన్నారు. అందులో కలిసి పోయిన ఓ వ్యక్తిపై అక్కడి వారందరికీ అనుమానం రాగ తాను కూడా బంధువునని చెప్పుకున్నాడు. అంత్యక్రియలు చేసి వచ్చే వరకూ తాను కూడా ఇక్కడే ఉంటానని పనులు చేసే అక్కడి వారికి సహకరించాడు. ఇంటి శుద్ధి పనులు అయ్యాక అతను ఇంట్లోకి వెళ్లగా కాసేపటికి కోతుల గుంపు ఇంట్లోకి వెళ్లింది. బయట ఉన్న వ్యక్తులు వాటిని తరమడానికి ప్రయత్నించడాన్ని గమనించిన సదరు వ్యక్తి ఇంట్లో నుంచి కోతులను తరుముతూ బయటకు వచ్చి పారిపోయాడు. దీంతో అనుమానం వచ్చి మిగతా బంధువులు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి మూడు బీరువాలు పగులగొట్టి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉండటాన్ని గమనించారు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. కోతులు రాకపోతే ఇంట్లో బంగారు ఆభరణాలు ఇతరత్రా ఎత్తుకెళ్లేవాడని స్థానికులు తెలిపారు. నిందితుడు ద్విచక్రవాహనంపై పారిపోయాడన్నారు.


ప్రమాదం జరిగిన బస్సు(ఫైల్)

మానని గాయం

సెప్టెంబరు 11.. కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైన రోజు. ఆ బస్సులో ఉన్న వారంతా కొండగట్టు అంజన్నను దర్శించుకుని వస్తున్న వారే. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా కలిసి అంజన్న వద్ద మొక్కులు తీర్చుకుని ఇళ్లకు బయల్దేరాలని బస్సు ఎక్కి కూర్చున్నారు. బస్సు మొత్తం నిండుగా ఉంది. ఎవరి ముచ్చట్లలో వారు నిమగ్నమయ్యారు. కొండగట్టు నుంచి బస్సు దిగుతుండగా ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడింది. అంతే అందులో ఉన్న ప్రయాణికులకు ఏం జరిగిందో తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటి వరకు తమతో మాట్లాడిన కుటుంబ సభ్యులు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రమాదంలో 67 మంది వరకు చనిపోయారు. ఇంకొందరు తీవ్ర గాయాలపాలైన ఇప్పటికీ లేవలేని స్థితిలో ఉన్నారు. ప్రమాదం జరిగిన రోజును గుర్తు చేసుకుంటూ క్షతగాత్రులు ఇప్పటికీ కన్నీటి పర్యంతం అవుతున్నారు. అత్యంత విషాధకర ఘటన జరిగి ఆరేళ్లు అవుతోంది.

- కొండగట్టు బస్సు ప్రమాదంలో 67 మంది మృతి
- నేటికీ కలిచివేస్తున్న ఘటన
- బాధితులకు అందింది అరకొర సాయమే

మల్యాల, సెప్టెంబరు 10: కొండగట్టు ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదానికి నేటికి ఆరు సంవత్సరాలు. ఈ ప్రమాదంలోని ప్రయాణికుల హాహాకారాలు.. క్షతగాత్రుల ఆర్తనాదాలు బంధువులతో పాటు స్థానికులను నేటికీ కలచి వేస్తున్నాయి. ఆనాటి ప్రమాద గుర్తులు కలవరపెడుతూనే ఉన్నాయి. ఈ సంఘట న దేశంలోనే అతిపెద్ద రహదారి ప్రమాదంగా నిలిచిపోగా.. సమారు 67 మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి కారణమైన ఈ ఘాట్‌రోడ్డుపై దిద్దుబాటు చర్యలు ఇప్పటి వరకు నామమాత్రమే.. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదేళ్లుగా సూచిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి లోయలో బోల్తాపడి 67మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 45మంది వరకు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదం అనంతరం ప్రస్తుత ఘాట్ రోడ్డును మూసివేశారు. వాహనాల రాకపోకలను నిషేదించారు. ఘాట్ రోడ్‌కు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణగోడల నిర్మాణం, స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు దుర్మరణం చెందగా, వందలాదిగా గాయాలపాలయ్యారు. అయినప్పటికీ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రమే. రెండేళ్ల క్రితం నిబంధనల తో కూడిన షరతులతో వాహనాల రాకపోకలను ప్రారంభించిన అధికారులు పలు శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలనే ఈఎన్‌సీ ఆదేశాలను పాటించడం లేదు.

● బాధితులకు అందని సహాయం

ఘాట్‌రోడ్డు పక్కన గల లోయలో ఆర్టీసీ బస్సు పడి 67 మంది మృతి చెందగా మృతుల కుటుంబాలను కదిలిస్తే ఇప్పటికీ వారి కన్నీళ్లు వరదలుగా ప్రవహిస్తున్నాయి. మృతుల్లో 60మందికి పైగ కొడిమ్యాల మండలానికి చెందిన వారే ఉండగా వారికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందకపోగా తీవ్ర వేదనకు గురౌతున్నారు. ప్రమాదం అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో పాటు ఆర్టీసీ రూ. 10లక్షలు అందించి చేతులు దులుపు కున్నట్లు బాధిత కుటుంబాలు అంటున్నాయి. క్షతగాత్రులు అయిన అనేక మంది ఇప్పటికీ మంచానికే పరిమితం కాగ కనీసం ప్రభుత్వం అందించే పింఛన్‌కు కూడా నోచుకోవడం లేదు. ప్రభుత్వం మృతుల కుటంబాలకు, క్షతగాత్రులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవల్సిన అవసరం ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఆ దశగా చర్యలు తీసుకోవడం లేదని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాం


పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రమాదకారక బస్సు

● ఠాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగ ఇప్పటికీ అలాగే ఉంది. ప్రమాదానికి సాక్షాత్కారంగా నిలుస్తోంది. ప్రమాదం అనంతరం న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. బస్సు రిలీజ్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో బస్సును తీసుకెళ్లడం లేదు. దీంతో బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోతోంది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో ఈ మార్గంలో నడిచే రైతులు, ఇతరులు బస్సును చూసి నాటి ప్రమాదాన్ని గుర్తు తెచ్చుకుంటున్నారు. బస్సును అక్కడి నుంచి తొలగించాలని పోలీసులను కోరుతున్నారు.


కొండగట్టు ఘాట్‌రోడ్డు

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య


సాయిచరణ్


పోచయ్య (ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు, 10: వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన యువకుడు జీవితం విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం పెంబట్ల గ్రామానికి చెందిన తేలు చంద్రయ్య పెద్ద కుమారుడు తేలు సాయి చరణ్(21) డిగ్రీ చదువుతున్నాడు. సాయి చరణ్‌కు తన స్నేహితులతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనే బలమైన కోరిక ఉండేది. అందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వచ్చాయి. ఆ కోరిక నెరవేరలేదని మనస్తాపానికి గురై వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన తల్లితండ్రులు చికిత్స నిమిత్తం జగిత్యాలలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మళ్లీ కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చరణ్ తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివంగాలపల్లిలో వృద్ధుడు..

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి గ్రామంలో సోమవారం వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన మక్కపల్లి పోచయ్య (80) అనే వృద్ధుడు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించినప్పటికీ నయం కాకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు మక్కపల్లి పరుశురాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

కరీంనగర్ క్రైం: బొమ్మకల్ గ్రామ పరిధిలోని హుస్సేనిపురకు చెందిన ఎండీ అక్బర్ (50) మంగళవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. కాగా అక్బర్‌కు దూరంగా పుట్టింటిలో ఉంటున్న అతడి మొదటి భార్య మున్నాబీ తన భర్త మరణంపై అనుమానాలున్నాయని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అక్బర్‌కు మున్నాబీతో వివాహం జరగగా వారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నాడు. 6 నెలల కిందట భర్త కొట్టడంతో కూతుళ్లతో కలిసి పుట్టిళ్లు మేడిపల్లిలో ఉంటోంది. మొదటి భార్యకు తెలియకుండానే మరొక మహిళను వివాహం చేసుకుని కాపురం చేస్తున్నాడని, ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా తనకు సమాచారం అందించారని తెలిపారు. ఇంటికి వెళ్లి చూడగా చనిపోయాడని మొదటి భార్య మున్నాబీ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 10 : పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను ఆరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి రూ.5,030 నగదు, 6 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

మంథని, సెప్టెంబర్ 10: మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణ అనే వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మందల మల్లారెడ్డి అనే వ్యక్తిని ఇనుముల సత్యనారాయణ రూ.5లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. రెండు లక్షలు తీసుకొని మిగితా 3లక్షల కోసం గన్‌మెన్ అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో సైతం అనేక మందిని ఇలానే బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిశాడని ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

రేషన్ షాపులో బెదిరింపులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 10: గోదావరిఖని ఫైవింక్లయిన్‌లోని ఒక రేషన్‌షాపులో సోమవారం రాత్రి కొత్తపల్లి శివచరణ్ అనే వ్యక్తి చొరబడి తాను విలేకరినని, క్వింటాలున్నర బియ్యం కావాలంటూ బెదిరింపులకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. రాత్రి షాపులోకి వెళ్లి శివచరణ్ నిర్వాహకుడు శివరాత్రి సురేష్‌తో బియ్యం గురించి గొడవ పెట్టుకున్నాడన్నారు. తన వద్ద అంత బియ్యం లేవని సురేష్ పేర్కొనగా శివచరణ్ కోపంతో తాను పత్రికా విలేకరినని, బియ్యం ఇవ్వవా అంటూ మిషన్‌ను ధ్వంసం చేశాడని, అడ్డువెళ్లిన శివరాత్రి సురేష్‌పై దాడి చేశాడని, బియ్యం ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉచిత విద్య అందించడంలో ప్రభుత్వాలు విఫలం

● పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 10: ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడికుమార్, ముల్కల తిరుపతి విమర్శించారు. మంగళవారం నగరంలో ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30న జార్జిరెడ్డి యాభై సంవత్సరాల సభను విజయవంతం చేయాలన్నారు. భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్‌యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్, శ్రీపాదశ్రీహరి, కోల శంకర్, దుస్స చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటివీరులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు కెస్వప్న, లోకిని రమేష్, రాజశేఖర్, వర్షిని, శైలజ, రజనీకాంత్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో సీఐడీ విచారణ

● ఆసుపత్రిలో సీఎంఆర్‌ఎఫ్ బిల్లులు తనిఖీ చేసిన అధికారులు

జమ్మికుంట, సెప్టెంబర్ 10: జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో జరిగిన సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల అక్రమాలపై తెలంగాణ సీఐడీ పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే ఘటనపై ఏడాది క్రితం అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. ఆగస్టు 26న సీఐడీ పోలీస్‌లు ఆసుపత్రికి వచ్చారనే సమాచారం అందుకున్న మీడియా అక్కడకు పెద్ద ఎత్తున చేరుకుంది. కానీ సీఐడీ అధికారులు ఎవరు అటువైపు రాలేదు. మంగళవారం కూడా సీఐడీ అధికారులు విచారణకు వచ్చారనే విషయం తెలుసుకున్న మీడియా ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే సీఐడీ అధికారులు వెళ్లిపోయారు. సప్తగిరి ఆసుపత్రి నుంచి ఒకే ఐడిపై రెండు సీఎమ్ఆర్ఎఫ్ బిల్లులు సృష్టించారు. ఫేక్ బిల్లులను గుర్తించిన అధికారులు ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సంతోష్ అనే వ్యక్తి బిల్లులు తయారు చేశాడని వైద్యుడు వంశీకృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా సీఐడీ పోలీస్‌లు సదరు వ్యక్తితో పాటు వైద్యుడిని విచారించారు. ఫేక్ సిఎమ్ ఆర్ఎఫ్ బిల్లులు ఎందుకు తయారు చేశారు... ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందని ప్రశ్నించారు. బిల్లులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆ ఫేక్ బిల్లులు ఎలా వచ్చాయో తనకు తెలియదని, బిల్లులపై ఉన్న సంతకం కూడా తనది కాదని వైద్యుడు సమాధానం ఇవ్వగా, అసలు ఆ బిల్లుల సంగతే తనకు తెలియదని సంతోష్ తెలిపాడు. సీఐడీ పోలీస్‌లు మాత్రం బిల్లులకు సంబంధించిన పలు రికార్డులు, పెన్‌డ్రైవ్‌లు తీసుకువెళ్లారు.

● సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల అక్రమాలపై అనుమానాలెన్నో?

సీఎమ్ఆర్ఎఫ్ బిల్లుల కోసం ఆసుపత్రి నుంచి చాలా పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ వైద్యుడికి సంబంధం లేకుండా బయటి వ్యక్తి తయారు చేయడం సాధ్యమేనా అన్న విషయంపై చర్చ జరుగుతోంది. సీఎం ఆర్ఎఫ్ కోసం ఆసుపత్రి నుంచి ఎమర్జెన్సీ సర్టిఫికెట్, ఎసెన్షియల్ సర్టిఫికెట్, డిశ్చార్జ్, ఇన్ పేషెంట్ ఐపి, ఇన్వెస్టిగేషన్, ఫార్మసీ, ల్యాబ్ తదితర బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటన్నింటినీ ఆసుపత్రిలో పనిచేసే ఒక వ్యక్తి తయారు చేయడం సాధ్యం కాదనే చర్చ జరుగుతోంది.

చిరుత దాడిలో గొర్రె మృతి

చందుర్తి, సెప్టెంబర్ 10: చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత పులి దాడిలో ఓ గొర్రె మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దోకె రాజయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెపై కొత్తకుంట సమీపంలో కర్షల బోరు వద్ద చిరుత పులి దాడి చేయడంతో గొర్రె మృతి చెందింది. గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుత దాడికి ఓ మేక మృతి చెందినట్లు తెలిపారు. చిరుతపులి దాడితో పశువుల కాపర్లు, రైతులు, గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

● 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

జగిత్యాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. డబ్బులు సులువుగా సంపాదించాలన్న ఆలోచనతో కొందరు ముఠాగా ఏర్పడి అంతరాష్ట్ర స్థాయిలో గంజాయి రవాణాకు పాల్పడడానికి నిర్ణయించుకున్నారు. ఆంధ్ర - ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా గంజాయిని తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం పూడూరు గ్రామానికి చెందిన ఎడమలపల్లి సాయి కుమార్, తుడుం సాయితేజ, కందుల అరుణ్, గౌరాపూర్ గ్రామానికి చెందిన ఎడపల్లి సాకేత్, జగిత్యాల మండలం దరూర్ గ్రామానికి చెందిన పాల రాజుకుమార్‌లను గంజాయి వ్యవహారంలో కొడిమ్యాల మండలం పూడూరు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా- ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి పెట్టుబడి పెట్టి తక్కువ ధరలో గంజాయిని కొనుగోలు చేసి పూడూరుకు తరలించారన్నారు. గంజాయిని ముఠా సభ్యులు పంచుకోవడా నికి ప్రయత్నిస్తున్న తరుణంలో పక్కా సమాచారం మేరకు కొడిమ్యాల, మల్యాల సర్కిల్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద 12 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కొడిమ్యాల ఎస్ఐ సందీప్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, కానిస్టేబుల్స్ తిరుమల్ రాజు, వినోద్, మల్యాల సీఐ నీలం రవి, డీఎస్పీ రఘు చందర్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

బంగారు గొలుసు దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 10: ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 8న జరిగిన దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ నెల 1న లూర్దునగర్‌లో నివసిస్తున్న దొవతిరెడ్డి ప్రతాపరెడ్డి ఇంటి ముందు ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు హారన్ కొట్టారు. దీంతో ప్రతాప్ రెడ్డి బయటకు వచ్చి ఎందుకు హారన్ కొడుతున్నారని అడిగే ప్రయత్నంలో ఆటోలోని ముగ్గురు వ్యక్తులు ఆయన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దోపిడీ విషయాన్ని ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఎన్‌టీపీసీ మెటీరియల్ గేట్ వద్ద ఆటోలో వెళ్తున్న ముగ్గురు నిందితులు గోదావరిఖనికి చెందిన ఆతుకూరి శ్రీనివాస్, బెజ్జంకి పృథ్వీరాజ్, రేణిగుంట రవితేజను అరెస్టు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరణకు గురైన రెండున్నర తులాల బంగారు గొలుసు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 10: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి, ఘన్పూర్ గ్రామాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటింటికి తిరిగి రేషన్‌బియ్యం పోగుచేసి ఒకదగ్గర ఉంచి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెన్కేపల్లి, ఘన్‌పూర్ గ్రామాలలో తన పోలీస్ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా రెండు గ్రామాలలో వేరువేరు చోట్ల అక్రమంగా నిలువ ఉంచిన 22క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని, వాటిని అక్రమంగా నిలువ ఉంచిన చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన పెద్ద భత్తుల కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్

● ఆలయ విస్తరణకు ఏర్పాట్లు చేయాలని సూచించిన సీఎం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 10: శృంగేరి జగద్గురు ఇచ్చిన మహా ప్రసాదం, శృంగేరి పరంపర చిత్రపటాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను ప్రారంభించడానికి శృంగేరి పీఠం వారి అనుమతులకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో వేముల శ్రీనివాసుల బృందం సోమవారం శృంగేరి పీఠంను సందర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జగద్గురు భారతి తీర్థ మహాస్వాముల వారు, పీఠాధిపతి విధిశేఖర భారతి స్వాముల వారు ఇచ్చిన మహాప్రసాదాన్ని అందేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆలయ విస్తరణ పనులపై సలహాలను, సందేహాలు నివృత్తి చేసిన తీరును వివరించారు. ఆలయ విస్తరణకు తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సంబంధిత అధికారులకు సీఎం సూచించారు.


సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రులు, ప్రభుత్వ విప్

ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి అనుకూలం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కరేనని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్‌లో ఎస్సీ వర్గీకరణపై సదస్సు నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే ఇచ్చిందని, ఇంకా వర్గీకరణ అమలు కావాల్సి ఉందన్నారు. ఎస్సీ వర్గీకణ విషయంలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. ఈ అంశంలో బీజేపీకి ఓటేయాలని మందకృష్ణ చెప్పినా అత్యధిక మాదిగలు కాంగ్రెస్‌కే ఓటు వేశారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇప్పటివరకు కేవలం మన సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమే చెప్పారని, బీజేపీ పాలిత ప్రాంత రాష్ట్రాల ముఖ్యమం త్రులు కాని, కేంద్రం కానీ ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో భారీ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

ఆస్తిలో వాటా కోసం భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

ఓదెల, సెప్టెంబరు 10: భర్త ఆస్తిలో వాటా కోసం మండలంలోని కొలనూర్‌లో మంగళవారం జంగ సంజీవరెడ్డి అనే వ్యక్తి ఇంటి ఎదుట అతడి భార్య వనజ, కూతురు శ్రీవర్ష బైఠాయించారు. బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ, సంజీవరెడ్డి మొదటి భార్య గతంలో మృతిచెందగా రెండో భార్యగా వీణవంక మండలం చల్లూర్‌కు చెందిన తనను వివాహం చేసుకున్నాడని తెలిపారు. కొద్ది రోజులైన తర్వాత ఆడపిల్లలు పుట్టారని చితకబాదుతూ చిత్రహింసలకు గురి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని, దీంతో తన తల్లి దగ్గర ఇద్దరు కూతుర్లతో బతుకుతున్నానని వనజ తెలిపారు. అనంతరం మరో మహిళను తీసుకువచ్చి కాపురం పెట్టాడని మూడో భార్యకు ఒక కుమారుడయ్యాడని తెలిపారు. మూడవ భార్య కుమారునికి 5 ఎకరాల భూమి పట్టా చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే ఇక మిగిలిన 6 ఎకరాల్లో మూడు ఎకరాల భూమిని తన కూతుర్లకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఇది పరిష్కారం అయ్యేవరకు ఇక్కడి నుంచి వెళ్లనని, అధికారులు స్పందించి, నా ఇంటిలో స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. ఇంటి ముందు భార్య, కూతురు బైఠాయించడంతో ప్రస్తుతం ఇంటికి తాళం వేసి సంజీవరెడ్డి, ఇతని మూడో భార్య, ఇద్దరు వృద్ధులు ఇక్కడి నుంచి పరారీ అయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 10: వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ. 2.26 కోట్లకు కుచ్చుటోపీ.. పరారీలో వ్యాపారి

చిగురుమామిడి,సెప్టెంబరు 10: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ప్రవీణ్‌కుమార్ అనే వ్యాపారి ఇదే గ్రామానికి చెందిన రైతులు, ఇతర ప్రైవేట్ వ్యక్తులు 98 మందికి 2.26 కోట్ల రూపాయల కుచ్చు టోపీ పెట్టిన వ్యాపారి పరారీలో ఉన్నాడు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా అడ్తి వ్యాపారం చేస్తూ అనేక మందికి నమ్మకంగా ఉండేవాడు. తిమ్మాపూర్ మండలం రేణికుంట, మొగిళిపాలెం, పర్లపల్లి, బెజ్జంకి మండలం దేవక్కపల్లి, ఇదే మండలం రేకొండ , సిద్దిపేట పట్టణానికి చెందిన వ్యక్తులు వరి ధాన్యం వ్యాపారికి విక్రయించారు. తమ వద్ద ఉన్న డబ్బులను కూడా అతనికి వడ్డీకి ఇచ్చారు. నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని 2 కోట్ల 26 లక్షల రూపాయాలకు ఎగనామం పెట్టి వ్యాపారి పరారీ అయ్యాడు. వ్యాపారికి ధాన్యం, డబ్బులు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. వ్యాపారిపై జిల్లా పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందులో కొంత మంది తమ కూతుళ్ల వివాహాలకు, మరికొంత మంది పిల్లల చదువుల కోసం, అనేక మంది తమ డబ్బు భద్రంగా ఉంటుందని వ్యాపారి వద్ద పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 సంవత్సరాల క్రితం మూతపడిన అయిల్ మిల్లులో తాను చేసిన వ్యాపారంలో నష్టం వచ్చిందని సదరు వ్యాపారి ప్రవీణ్‌కుమార్ కోర్టును సంప్రదించి తమకు నోటీస్ పంపించారని బాధితులు అంటున్నారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి తమకు నాయ్యం చేయాలని కోరుతున్నారు. ప్రవీణ్‌కుమార్ ఇంటికి తాళం వేసి ఉన్నదని గ్రామస్థులు తెలిపారు. వ్యాపారి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉందని అంటున్నారు. వ్యాపారికి ఇద్దరు కుమారులు, భార్య ఉంది.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 : రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న ఉపాధ్యాయుడు పాకాల శంకర్ గౌడ్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సన్మానించారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జాతీయ స్థాయిలో అవార్డులను సాధించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి రాంప్రాసద్ పాల్గొన్నారు.

మానసిక కుంగుబాటుతో ఆత్మహత్యలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 : మానసిక కుంగు బాటు ఆత్మహత్యలను ప్రేరేపిస్తుందని, దీనికి కౌన్సెలింగ్ తీసుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో మంగళవారం ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా మరమగ్గాల కార్మికుల కుటుంబాలకు మనోవికాస సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నం చందర్ మాట్లాడుతూ సమాజంలో విస్తృత చర్చ, కౌన్సెలింగ్ ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చునన్నారు. మైండ్‌కేర్ సెంటర్ సామాజిక కార్యకర్తలు రాపెల్లి లత, కొండ ఉమ, వేముల అన్నపూర్ణ, బూర శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

వేములవాడ, సెప్టెంబరు 10 : మిడ్ మానేరు ప్రాజెక్టులో చేపల వేటను ఆధారంగా చేసుకొని జీవిస్తున్న మత్స్య కార్మికుల ఉపాధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏటా సుమారు 30 లక్షల చేప పిల్లలను రాజరాజేశ్వర జలాశయంలో వదిలారని, ముంపునకు గురైన 13 గ్రామాలతోపాటు వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు చెందిన మత్స్య కార్మికులు ఐదేళ్లుగా మధ్య మానేరుపై ఆధారపడి చేపల వేట ద్వారా ఉపాధి పొందారని గుర్తు చేశారు. మిడ్ మానేరు జలాశయంలో చేపల వేటపై ఆధారపడి ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 5000 మంది జీవిస్తున్నారని, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు చేప విత్తనాల పంపిణీపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా స్పందించాలని, మధ్య మానేరు ప్రాజెక్టులో చేపల పెంపకంపై దృష్టి సారించి మత్స్య కార్మికులను ఆదుకోవాలని కోరారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10: విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. వల్లంపట్లలోని కేరళ మాడల్ పాఠశాలలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై వేధింపులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాముల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 : సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. భారత దేశంలో హైదరాబాద్ రాష్ట్రం విలీనమై 76 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ కోసం పోరాటం చేసిన అమరులను స్మరించుకోవడం కోసం సెప్టెంబరు 11 నుంచి 17 వరకు సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ విముక్తి కోసం త్యాగాలు చేసిన కమ్యూనిస్టు యోధులను భావితారాలు గుర్తు చేసుకోవడానికి వారి జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా సభ్యుడు సోమ నాగరాజు పాల్గొన్నారు.

ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలి



వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 10 : ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని, ఇందు కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు డీఈవో రమేశ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేష్, శ్రీనివాస్, కొలనూరు కరుణాకర్, సంపత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గంభీరావుపేట, సెప్టెంబరు 10 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య, ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్‌బీఐ కౌన్సిలర్ రమేష్, కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆర్‌బీఐ కౌన్సిలర్స్ భాస్కర్, భరత్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి, సెప్టెంబరు 10 : తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నట్లు, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న మూడు ఆటోలను, 15 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచకు చెందిన కర్రే సంతోష్, కర్రే వెంకటేష్, ఇబ్రహీంనగర్‌కు చెందిన అనారసి సంపత్, తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పర్వతం ప్రవీణ్, పాండు, ముస్తాబాద్ మండలం మోహినికుంట గ్రామానికి చెందిన కనకయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

ముస్తాబాద్, సెప్టెంబరు 10 : మండలంలోని చిప్పలపల్లిలో కళ్లకు గంతలతో కేటీఆర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. మాజీ సర్పంచ్ జ్యోతి ఎల్లం, శీలం స్వామి, కొమ్మెట రాజమల్లు, ఎండీ జహంగీర, పోతారం సతీశ్, వంగూరీ దిలీప్, హనుమయ్య, గట్టయ్య, రమేశ్, లింగంస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న హోటల్ యజమాని

చందుర్తి, సెప్టెంబరు 10: మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యాపారి పర్సును పోగొట్టుకోగా చందుర్తి మండల కేంద్రం చెందిన హోటల్ యజమానికి దొరికింది. దీంతో వ్యాపారి మంగళవారం పర్సు అందజేసి నిజాయితీ చాటుకున్నారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన బాస నగేష్ అనే కిరాణా వ్యాపారి సిరిసిల్ల నుంచి మెట్‌పల్లి వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. చందుర్తి మండల కేంద్రం సమీపంలో దాదాపు రూ.10 వేలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న పర్సును పోగొట్టుకున్నాడు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన రేణుక హోటల్ యజమాని బుర్ర రాజుకు దొరికింది. పరిచయస్తుల ద్వారా నగేష్ వివరాలు తెలుసుకొని అప్పగించారు. నిజాయితీ చాటుకున్న రాజును గ్రామస్థులు అభినందించారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్, నాయకులు



వేములవాడలో నివాళులర్పిస్తున్న నాయకులు



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల టౌన్: తెలంగాణ ఉద్యమంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని సిరిసిల్ల రజక సంఘం, మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బతుకమ్మ ఘాట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐలమ్మ రజాకర్ల దౌర్జన్యాలకు ఎదురు తిరిగిన వీర వనిత అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, అన్నారం శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, డైరెక్టర్ బుర్ర రాజు, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన వీరనారి కమ్యూనిస్టు ఉద్యమ నాయకురాలు చాకలి ఐలమ్మ అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సిరిసిల్ల పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు సెప్టెంబరు 13 నుంచి 16 వరకు జిల్లాలో సమావేశాలు నిర్వహించి సెప్టెంబరు 17 రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బహిరంగసభను నిర్వహించనున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జివ్వాజి విమల, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, అన్నల్‌దాస్ గణేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేస్, స్వర్గం శేఖర్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా రచయితల వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలను వేసి కవులు, రచయితలు నివాళ్లు అర్పించారు. ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, జిల్లా రచయితల వేదిక అధ్యక్షుడు ఎలగోండ రవి, కోశాధికారి అడెపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్దాపూర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు కౌన్సిలర్లు నాగరాజుగౌడ్, రాజిరెడ్డి, పోచవేణి సత్య ఎల్లయ్య లక్ష్మీశంకరయ్య, కీర్తికమలాకర్‌రావు, సత్యనారాయణ, లతమధు, భూక్య రెడ్డినాయక్, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట, కందికట్కూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ ముత్యం అమర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, మండల రజకసంఘ అధ్యక్షుడు పర్శరాం, జిల్లా ఉపాధ్యక్షుడు తెలంగాణ శ్రీనివాస్, జిల్లా అధికారప్రతినిధి శ్రీనివాస్, యువత అధ్యక్షుడు సంపత్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, తదితర గ్రామాల్లోని రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, మాజీ ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, రజక సంఘం మండల ప్రధాన కార్యదర్శి రవి, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు రాజనర్సు కోశాధికారి బాబు, రజక సంఘం నాయకులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్, సీపీఎం, రజక సంఘం నాయకులు వేరువేరుగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, సీపీఎం మండల అధ్యక్షుడు కోడం రమణ, రజక సంఘం నాయకులు పెద్దూరు తిరుపతి, ఆయా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. రజక సంఘం మండల అధ్యక్షుడు పూల్లూరి శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడలోని తెలంగాణ చౌక్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్ సిరిగిరి రామచందర్, నాయకులు యాదగిరి ప్రసాద్ రావు, నరాల దేవేందర్, గన్నమనేని రామారావు, వెంగల శ్రీకాంత్ గౌడ్, కర్ల శేఖర్, దేవయ్య, లిక్కిడి మహేందర్, మైలారం రాము, జిల్లా రజక సంఘం నాయకులు దేవయ్య పాల్గొన్నారు.

బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రజక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, పులి సత్తయ్య, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంతోపాటు పలు గ్రామాల్లో చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రజక సంఘం అధ్యక్షుడు లోకుర్తి లింబయ్య, లోకుర్తి అంజయ్య, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు ఉపాధి హర్షణీయం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 10 : సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ పోరాట ఫలితంగానే సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నేతన్నలకు ఉపాధి నిమిత్తం కోటి 30లక్షల చీరల ఆర్డర్‌లను ఇవ్వనున్నట్లు ప్రకటించారన్నారు. వస్త్ర పరిశ్రమల అభివృద్ధి కోసం స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్‌లను ఇప్పించాలని కోరారు. ఇతర రాష్ట్రాల కంటే కరెంట్ చార్జీలు తక్కువ ఉండేలా నిర్ణయం చేయాలని, అన్నిరకాల మరమగ్గాలకు నాలుగో కేటగిరి కింద కేటాయించి సబ్సిడీ అందించాలని కోరారు. కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించేలా ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, నక్క దేవదాస్, బెజుగం సురేష్, స్వర్గం శేఖర్‌చ బింగి సంపత్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

కవితా పోటీల్లో ప్రతిభ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10: తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే అంశంపై జరిగిన కవితా పోటీలలో ముస్కాని పేటకు చెందిన తునికి తిరుపతి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించారు. మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తిరుపతిని మంగళవారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి అభినందించారు.

ఆర్టీసీ బస్సులో సీటు కోసం గొడవ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10: ప్రయాణికులతో సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు సీటు కోసం గొడవకు దిగాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తోంది. ఓ ప్రయాణికుడు కామారెడ్డి వెళ్లేందుకు సిరిసిల్ల పాత బస్టాండ్‌లో సుమారు 110 మంది ఉన్న బస్సులో ఎక్కాడు. భార్యాభర్తలు పిల్లాడితో కలిసి ఇద్దరు కూర్చునే సీటులో కూర్చున్నారు. బాలుడికి జ్వరం రావడంతో సీటుపై పడుకోబెట్టారు. దీంతో ప్రయాణికుడు వారితో సీటు కోసం గొడవకు దిగాడు. బస్సు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ వరకు చేరుకుంది. డ్రైవర్ బస్సును నిలిపి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ కిషన్‌రావు ఆధ్వర్యంలోని పోలీసులు బస్సులోని ప్రయాణికులను కిందకు దింపి గొడవ చేస్తున్న ప్రయాణికుడిని మందలించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులు దిగితే ఖాళీ సీటులో కూర్చోవాలని సూచించారు. సదరు ప్రయాణికుడు శాంతించాడు.

సంక్షిప్తంగా..

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని 24వ వార్డు రాజీవ్‌నగర్‌లో మంగళవారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి ఎడమల శ్రీధర్‌రెడ్డి కళాబృందం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించింది.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో జిల్లామోటార్ వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ మంగళవారం పరిశీలించారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లి ఆదర్శ రైతు పరస్పర సహాయ సహకార సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బీజేపీని అడ్డుపెట్టుకొని అక్రమ వసూళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 : బీజేపీని అడ్డుపెట్టుకొని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో తాను లేని సమయం చూసి మున్సిపల్ అధికారులు తమ భవనాలకు రక్షణగా ఉన్న షెటర్లను మూసి కూల్చివేశారని ఆరోపించారు. భవనానికి అనుకొని ఉన్న డ్రైనేజీని కూడా కూల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానం, మున్సిపల్ చట్టాలను తాను గౌరవిస్తానన్నారు. భవనానికి సంబంధించిన సెల్లార్‌ను కమర్షియల్‌గా వాడుతున్నానని, కోర్టులో వాదనలు జరుగుతున్నాయని అన్నారు. కోర్టు నుంచి ఆర్డర్ లేకుండా ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడని, సెల్లార్‌లోని షెటర్లను మున్సిపల్ అధికారులు కూల్చారని అన్నారు. సెల్లార్‌లను కూల్చాలని కోర్టు నుంచి తీర్పు రాలేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజలకు వివరించడానికి మీడియా ముందు కొచ్చినట్లు చెప్పారు. ఇందులో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగలేదన్నారు. 2004లో మూడు అంతస్తులకు అనుమతి తీసుకొని మున్సిపల్‌కు టాక్స్ కూడా కడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ అధికారులు అతి ఉత్సాహం చూపి సెల్లార్‌లోని షెటర్లను కూల్చారని దీనిపై న్యాయపరంగా ముందుకెళ్తానన్నారు. శ్రీనివాస్ సిరిసిల్ల పట్టణ ప్రజల గృహ నిర్మాణలకు సంబంధించిన వివరాల కోసం అర్జీలతో ప్రొసీడింగ్‌లు తీసుకుంటూ వారిని బెదిరింపులకు గురి చేస్తున్నాడని, అక్రమంగా వసూళ్లు చేస్తున్నాడని ఆరోపించారు. దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తికి బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా పదవి ఇచ్చిందని, పార్టీ అధినాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగుల శ్రీనివాస్ గతంలో తన వద్ద రూ. 5 లక్షలు అప్పుగా తీసుకున్నాడన్నారు. 2018లో తీసుకున్న డబ్బులు అడిగినందుకు తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు సుంకపాక మనోజ్‌కుమార్, కత్తెర వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు





మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 : తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యలను స్వీకరించనున్న మహేష్ కుమార్ గౌడ్‌కు జిల్లా నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన టీపీసీసీ అధ్యక్షుడిని కలసిన వారిలో టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు వైద్య శివప్రసాద్, పద్మశాలి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ ఉన్నారు.

గంభీరావుపేట: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను గంభీరావుపేట గౌడ సంఘం నేతలు మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిశారు. గౌడ సంఘం రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు కామారెడ్డి హనుమాన్లు గౌడ్, సాయబుగారి లక్ష్మణ్‌గౌడ్, పట్టణ గౌడ సంఘం నంబరు 2 అధ్యక్షుడు బంగ్లా రాజుగౌడ్, స్థానిక గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

కాలిపోయిన బోరు మోటారు.. అందని తాగు నీరు



ట్యాంక్ వద్ద బిగించని బోరు మోటారు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 10: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో తాగు నీటి ట్యాంకు వద్ద బోరు మోటారు కాలిపోయింది. దీంతో కాలనీవాసులు తాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం దూర ప్రాంతానికి వెళ్లి బిందెలతో తెచ్చుకుంటు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు మోటారు కాలిపోయి పది రోజులు గడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయించడంతోపాటు తమకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేని పక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

గత ప్రభుత్వ పాపాలను కడిగేస్తున్న కాంగ్రెస్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 10 : గత ప్రభుత్వ పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం కడిగేస్తోందని చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పవర్‌లం పరిశ్రమలో సంక్షోభవం రావడంతో ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేక చాలా మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన హర్షణీయం అన్నారు. చేనేత సొసైటీలకు ఉన్న పాత బకాయిలకు సంబంధించిన రూ.30 కోట్లు వేదికపైనే సంతకం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పద్మశాలీలను ఆదుకోవాలని కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పవర్‌లూం పరిశ్రమ, అనుబంధ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సు నడిపించాలి

వీర్నపల్లి, సెప్టెంబరు 10: మారుమూల అటవీ ప్రాంతాల విద్యార్థుల కోసం పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను సమయానుకూలంగా నడిపించేందుకు సిరిసిల్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు చోటు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు ఉన్నా కొన్ని చోట్ల డ్రైవర్లు బస్సు ఆపడం లేదంటూ మండిపడ్డారు. అడవి పదిర గ్రామానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కథలాపూర్, సెప్టెంబరు 10: షెడ్యూల్డ్ కులాల జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ న్యాయమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భా స్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లా డా రు. ఎస్సీ వర్గీకరణ అంటే కేవలం మాల, మాదిగల పంచాయతీ కాదని 59 కులాల న్యాయబద్ధమైన పోరాటమన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలులో దేశంలోనే తెలంగాణలో ముందుంటుందని సీఎం ప్రకటించిన నేపథ్యంలో ప్రకటించిన, రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తింపజేయాలన్నారు.

నేడు కథలాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కథలాపూర్, సెప్టెంబరు 10: ఈ నెల 11న మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటిస్తారని సెర్ప్ ఏపీఎం నరహరి, తహసీల్దార్ వినోద్ తెలిపారు. బొమ్మెనలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ ఎంటర్ ప్రైజెస్, కథలాపూర్‌లో పెరటి కోళ్ళ మదర్ యూనిట్ ప్రారంభిస్తారని తెలిపారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తారన్నారు.

వినాయక మండపాల వద్ద పూజలు



పూజలు చేస్తున్న ప్రతాప రామకృష్ణ



ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న హమీద్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోనిఒకటో వార్డులోని రైజింగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయక మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్లారెడ్డిపేట మండలంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఆది దేవుడిని కొలిచారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలో వినాయక నవరాత్రుల సందర్భంగా మాజీ ఎంపీటీసీ మహమ్మద్ హమీద్ మంగళవారం రాత్రి లడ్డూ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పరిధిలో ఉన్న గణేష్ మండపాలన్నింటికీ హమీద్ తన వంతుగా లడ్డూ ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు గౌడ్, మాజీ సర్పంచ్ అక్కపెల్లి బాలయ్య, బీజేపీ సీనియర్ నాయకులు పత్తి స్వామి రాజు, యూత్ సభ్యులు బట్టు సాయి, ఆశయగారి చంద్రశేఖర్ గౌడ్, దినేష్‌గౌడ్, అన్నం కృష్ణమూర్తి, దేవి రెడ్డి, శ్రీకర్ అక్షయ్ గౌడ్ ,శేషగౌడ్, హరీష్, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ సమీపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.